GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : మంగళవారం- డిసెంబర్ 19-2023 పేజీలు : 3

# మళ్లీ కరోనా వైరస్

- ఐదుగురు మృతి



**టీ మీడియా, డిసెంబరు 18, న్యూఢిల్లీ:**

దేశంలో కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తున్నది. ఆదివారం ఒక్కరోజే కొత్తగా 335 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఐదుగురు మరణించారు. వారిలో నలుగురు కేరళలోనే ఉండటం గమనార్హం. ప్రస్తుతం దేశంలో 1,701 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో ఇప్పటివరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 4.50 కోట్లు (4,50,04,816) దాటింది. వీరిలో 4.46 కోట్ల మంది కోలుకున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. కరోనా వల్ల 5,33,316 మంది మరణించారని తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా కరోనా రికవరీ రేటు 98.81 శాతం, మరణాల రేటు 1.19 శాతంగా ఉందని పేర్కొంది. ఇప్పటివరకు 220.67 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులు ఇచ్చినట్లు చెప్పింది. కాగా, కేరళలో జేఎన్-1 అనే కొత్త కరోనా వేరియంట్ బయటపడిన విషయం తెలిసింది. దీనివల్ల 73 ఏండ్ల మహిళ సహా నలుగురు మరణించగా, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు చనిపోయారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# తెలంగాణ నుంచి సోనియా పోటీ..

- పీఏసీ తీర్మానం



**టీ మీడియా, డిసెంబరు 18, హైదరాబాద్ :**

తెలంగాణ నుంచి సోనియా గాంధీని లోక్‌సభకు పోటీ చేయించాలని కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ తీర్మానం చేసింది. గాంధీ భవన్‌లో పీఏసీ చైర్మన్ మాణిక్ రావు థాక్రే అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కన్వీనర్ షబ్బీర్ అలీ, వీ హనుమంతరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పీఏసీ సమావేశం తొలిసారిగా జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా పార్లమెంట్ ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఆరు గ్యారెంటీల అమలుపై చర్చించారు. సమావేశం ముగిసిన అనంతరం షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడారు. గతంలో ఇందిరా గాంధీ మెదక్ నుంచి పోటీ చేశారు. సోనియాను తెలంగాణ నుంచి పోటీ చేయించాలని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. మిగతా గ్యారెంటీల అమలుపై అసెంబ్లీలో చర్చిస్తామన్నారు. గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేస్తాం. మహిళలకు నెలకు రూ. 2500 భృతిపై ఈ నెల 28న చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రూ. 4 వేల పెన్షన్ అమలు, విధివిధానాలపై చర్చిస్తున్నాం. ఈ నెల 28 నుంచి కొన్ని పథకాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసి చూపిస్తాం అన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, ఏఐసీసీ అగ్ర నేతలు, ప్రచారంలో పాల్గొన్న నాయకులు, ఇంచార్జులుగా పని చేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ తరపున ధన్యవాదాలు చెపుతూ తీర్మానం చేశారు. ఈ తీర్మానానికి సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

# ఒకే కుటుంబంలో ఆరుగురు హత్య



**టీ మీడియా, డిసెంబరు 18, నిజామాబాద్ :**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సంచలన ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దారుణ హత్యకు గురయ్యారు. వారం వ్యవధిలోనే ఒక్కొక్కరిని ఓ నిందితుడు హతమార్చారు. సదాశివ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మాక్లూర్‌కు చెందిన ప్రసాద్ కుటుంబం గతంలో ఆ గ్రామాన్ని వదిలేసి మాచారెడ్డికి వెళ్ళిపోయి స్థిరపడింది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ప్రసాద్‌కు మాక్లూర్‌లో ఓ ఇల్లు ఉంది. ప్రసాద్ స్నేహితుడు ప్రశాంత్ ఆ ఇంటిపైన కన్నేశాడు. లోన్ ఇప్పిస్తానని చెప్పి అతని పేర రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తీరా లోన్ రాకపోగా ఇల్లును తిరిగి తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని ప్రశాంత్‌ను ప్రసాద్ ఒత్తిడి చేశాడు. ఎలాగైనా ఆ ఇంటిని తన సొంతం చేసుకోవాలనుకున్న ప్రశాంత్.. పథకం ప్రకారం ప్రసాద్‌ను బయటకు తీసుకెళ్ళి నిజామాబాద్ %--% కామారెడ్డి జాతీయ రహదారి అటవీ ప్రాంతంలో హత్య చేశాడు. మరుసటి రోజు ప్రసాద్ ఇంటికి వెళ్ళి మీ భర్తను పోలీసులు అరెస్టు చేశారని నమ్మించి ఆమెను బయటకు తీసుకెళ్ళాడు. ఆమెను కూడా హతమార్చి బాసర నదిలో వదిలేశాడు. ఆ తర్వాత ప్రసాద్ పెద్ద సోదరిని హత్య చేశాడు. ఇద్దరు పిల్లలను సోన్ బ్రిడ్జి సమీపంలో.. ప్రసాద్ చిన్న సోదరిని మాచారెడ్డి సమీపంలో హత్య చేసినట్లు సమాచారం. మాక్లూర్‌కు చెందిన నిందితుడు ప్రశాంత్ వయసు 20 ఏళ్లు. మొదటి మూడు హత్యలు ఒక్కడే చేశాడని.. మిగిలిన మూడు హత్యల్లో మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హత్య కాబడిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఎక్కడా అదృశ్య కేసు నమోదు కాలేదు. నమ్మిన స్నేహితుడే నర హంతకుడిగా మారి కుటుంబాన్ని అంతమొందించటం కలకలం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## డ్రైవర్‌లెస్ కార్లను భారత్‌లోకి ఎప్పటికీ అనుమతించబోం

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**టీ మీడియా, డిసెంబరు 18, న్యూఢిల్లీ:**

దేశంలోని డ్రైవర్ల ఉద్యోగాల భద్రత దృష్ట్యా డ్రైవర్ లెస్ కార్లను భారత్‌లోకి ఎప్పటికీ అనుమతించబోమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఐఐఎం నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రోడ్డు భద్రతా సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రైవర్‌లెస్ కార్లను దేశంలోకి అనుమతించబోమని స్పష్టంచేశారు. అదేవిధంగా కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌ల ఏర్పాటు, రోడ్లపై బ్లాక్ స్పాట్‌లను తొలగింపు లాంటి చర్యలతో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించామని కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. ప్రజా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. హైడ్రోజన్‌ను భవిష్యత్తు ఇంధనంగా నితిన్ గడ్కరీ అభివర్ణించారు. ఇటీవల పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో గడ్కరీ మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై మూలధన వ్యయం 2013-14లో రూ.51 వేల కోట్లు ఉండగా.. 2022-23లో రూ.2.40 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. 2013-14లో రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపులు రూ.31,130 కోట్లు కాగా.. 2023-24 నాటికి ఇది రూ.2,70,435 కోట్లకు పెరిగిందని మంత్రి చెప్పారు.

## నేను వృద్ధుడ్ని కాదు.. కొంతమందిని సరిదిద్దే శక్తి ఉంది

- ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్



**టీ మీడియా, డిసెంబరు 18, ముంబై:**

తాను వృద్ధుడ్ని కాదని మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ అన్నారు. కొంతమందిని సరిదిద్దే శక్తి ఉందని తెలిపారు. డిసెంబర్ 12న శరద్ పవార్ పుట్టిన రోజు. ఈ నేపథ్యంలో పూణేలోని చర్కోలీలో ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. దీనిని తిలకించిన శరద్ పవార్ ఈ సందర్భంగా మాట్లాడారు. తన వయసు 83, 84 ఏళ్లుగా పేర్కొంటూ, ఇక రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తున్న ఎన్సీపీ కీలక నేత అజిత్ పవార్ వంటి వారిపై పరోక్షంగా మండిపడ్డారు. 'మీరు నాలో ఏమి చూశారు? నాకు వృద్ధాప్యం రాలేదు. నాలో శక్తి సడలలేదు. నేను కొంతమందిని సరిదిద్దగలను. మీరు చింతించకండి' అని జనాన్ని ఉద్దేశించి అన్నారు. అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి సీఎం ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరి డిప్యూటీ సీఎం పదవి చేపట్టిన నేపథ్యంలో ఆ పార్టీ రెండు వర్గాలుగా వీడటంపై ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. కాగా, ఎడ్ల బండ్ల పోటీలు వంటి క్రీడలు రైతులకు సంతృప్తిని, విశ్వాసాన్ని ఇస్తాయని శరద్ పవార్ తెలిపారు. సరైన నిర్ణయం తీసుకుంటే ఈ పోటీని ఒలింపిక్స్‌లో కూడా చేర్చవచ్చని అన్నారు. అధికారంలో ఉన్నవారికి రైతులపై ప్రేమాభిమానాలు లేవని విమర్శించారు. ఉల్లితో సహా కొన్ని ఉత్పత్తులపై ఎగుమతి నిషేధం వంటి నిర్ణయాలే దీనికి ఉదాహరణ అని అన్నారు. ప్రభుత్వం రైతులకు సహాయం చేయడానికి బదులు అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు.

## జ్ఞానవాపి మసీదుపై సైంటిఫిక్ సర్వే రిపోర్టు కోర్టుకు అందజేత

**టీ మీడియా, డిసెంబరు 18, వారణాసి:**

కాశీ విశ్వనాథ్ ఆలయ సమీపంలో ఉన్న జ్ఞానవాపి మసీదు పై చేపట్టిన సర్వే నివేదికను జిల్లా జడ్జికి అప్పగించారు. సీల్డ్ కవర్‌లో ఉన్న రిపోర్టును పురావాస్తు శాఖ స్టాండింగ్ కౌన్సిల్ అమిత్ శ్రీవాత్సవ్.. వారణాసి జడ్జి టేబుల్ ముందు పెట్టారు. ఈ కేసులో అలహాబాద్ హైకోర్టు ఈనెల 21వ తేదీన తన తీర్పును వెలువరించనున్నది. జ్ఞానవాపి మసీదులో పూజలు నిర్వహించేందుకు హక్కు కల్పించాలని కోరుతూ కొందరు హిందువులు పిటీషన్ వేసిన విషయం తెలిసిందే. ఆ పిటీషన్ ఆధారంగా జ్ఞానవాపి మసీదులో సైంటిఫిక్ సర్వే చేపట్టారు. హిందువుల తరపున కేసు దాఖలు చేసిన మదన్ మోహన్ యాదవ్ మాట్లాడుతూ.. వారణాసి జిల్లా కోర్టులో ఆర్కియాలజీ శాఖ తన సైంటిఫిక్ రిపోర్టును ప్రజెంట్ చేసినట్లు చెప్పారు.



# ఏ పేదోడు వైద్యం కోసం..అప్పుల పాలు కావొద్దు

- ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి




**టీ మీడియా, డిసెంబరు 18, తాడేపల్లి :**

ఏ పేదోడు వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదనే తపన, తాపత్రయంతో ఉచితంగా వైద్యం పొందేందుకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తీసుకు వచ్చామని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో చరిత్రను సృష్టించామని, రూ.5లక్షల వరకూ ఆరోగ్యశ్రీ వైద్య సేవలను రూ.25 లక్షలకు పెంచామని చెప్పారు. తాడేపల్లిలో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో సీఎం జగన్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాకముందు 748 హాస్పటిల్స్లో 1059 ప్రొసిజర్స్కు ఆరోగ్యశ్రీ అమలు జరిగిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రొసిజర్స్ను 2000లకు పెంచామని, ఇప్పుడు ఈ ప్రొసిజర్స్ సంఖ్యను 3257కు పెంచామని వివరించారు. వైద్యం కోసం ఏ పేదవాడు అప్పుల పాలు కాకూడదనే తపన, తాపత్రయంతో ఆరోగ్యశ్రీ పరిధిని పెంచామని, అదేవిధంగా నెలకు రూ.40వేల జీతం తీసుకునే కుటుంబాలకూ ఆరోగ్యశ్రీ వర్తించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. దీంతో రాష్ట్రంలో 1.48 కోట్ల కుటుంబాలు, అంటే 4.25 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ అనువర్తిస్తుందని వివరించారు. మరీ ముఖ్యంగా తాము అధికారంలోకి రాక ముందు రాష్ట్రంలో 748 హాస్పిటల్స్లో ఆరోగ్యశ్రీ సేవలు అందేవని, ఇప్పుడు తాము 2513 హాస్పిటల్స్ లో ఆరోగ్యశ్రీ అమలు జరిగిలా విస్తరించామని, ఇందులో 2309 ఏపీ హాస్పిటల్స్లో, హైదరాబాద్లో 85, బెంగళూరులో 35, చెన్నైలో 19 సూపర్ స్పెషలిస్టు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆరోగ్య శ్రీ కోసం ఏటా రూ.4500 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఏపీలోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఎంపీ స్థానంలో ఒక మెడికల్ కాలేజీని నెలకొల్పుతామని వివరించారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఉచితంగా వైద్యాన్ని అందించటమే కాదు, ఉచిత వైద్యాన్ని ఎలా పొందాలో అవగాహన కల్పిస్తామన్నారు.

# 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం

**టీ మీడియా, డిసెంబర్ 18, తిరుమల:**

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై అధికారులు, అర్చకులతో చర్చించామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 23న వేకువజామున 1.45 నిమిషాల నుంచి భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనాన్ని ప్రారంభిస్తామన్నారు. 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని తెలిపారు. జనవరి 1వ తేదీ అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలను మూసివేస్తామని చెప్పారు. వీఐపీలు వారి కుటుంబ సభ్యులతో వస్తేనే దర్శనం టికెట్లను కేటాయిస్తామన్నారు. ఈ పది రోజుల పాటు సిఫారస్సు లేఖలపై కేటాయించే దర్శనాలను రద్దు చేశామని ప్రకటించారు. తిరుమల్లో వసతి సమస్య ఉందని.. వీఐపీలు టీటీడీకి సహకరించి తిరుపతిలో వసతిని పొందాలన్నారు. ఈ నెల 22న ఉదయం నుంచి 4.25 లక్షల దర్శన టోకెన్లను భక్తులకు కేటాయిస్తామని తెలిపారు. 10 రోజుల టోకెన్ కోటా పూర్తయ్యే వరకు భక్తులకు టోకెన్లను జారీ చేస్తామన్నారు. టోకెన్లను పొందిన భక్తులు 24 గంటల సమయం ముందే తిరుమలకు రావాలన్నారు. దర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే గదులు కేటాయిస్తామని చెప్పారు. టోకెన్స్ లేని భక్తులు తిరుమలకు రావొచ్చుని.. కానీ ఆ భక్తులకు శ్రీవారి దర్శనంతో పాటు గదులను కేటాయించమని స్పష్టం చేశారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇస్తారని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.



## ప్రభుత్వ ఆస్తులు

# దోచుకున్నవారిని వదిలిపెట్టం

-మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**టీ మీడియా, డిసెంబర్ 18, ఖమ్మం:** తమది కక్ష సాధింపుల ప్రభుత్వం కాదని..ఫ్రెండ్లీ ప్రభుత్వమని..కానీ ప్రభుత్వ ఆస్తులు దోచుకున్నవారిని విడిచిపెట్టేదిలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.తమది కక్ష సాధింపుల ప్రభుత్వం కాదని.. ఫ్రెండ్లీ ప్రభుత్వమని.. కానీ ప్రభుత్వ ఆస్తులు దోచుకున్నవారిని విడిచిపెట్టేదిలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఏ అధికారిపైనా గానీ.. ఏ నాయకులపైన గానీ తమ ప్రభుత్వానికి కక్ష లేదని అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అవకతవకలకు పాల్పడివారిని ఎట్టి పరిస్థితుల్లోను విడిచిపెట్టేది లేదన్నారు.గత ప్రభుత్వం ఒత్తిడుల వల్ల ఎవరైనా అధికారులు తప్పులు చేసి ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని.. కానీ తప్పుల్ని కొనసాగిస్తే మాత్రం ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలను అధికారులపై రుద్దారని.. ఆ ఒత్తిళ్లు భరించలేక తప్పులు చేసి ఉంటే వెంటనే సరిదిద్దు కోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తుల్ని దోసుకున్నవారిని మాత్రం వదిలేదిలేదన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బుధవారం అసెంబ్లీ వేదికగా శ్వేతపత్రం విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉందన్నారు. అన్ని శాఖలపై సమీక్ష చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారు..? అంటూ అప్పుడే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని.. కానీ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే డిమాండ్ చేయటం సరికాదన్నారు. అన్నింటిమీదా సమీక్షలు నిర్వహించి ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని తెలిపారు.ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని.. డిసెంబర్ 28న మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తామని తెలిపారు. సంక్రాంతికి మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తామని తెలిపారు. రెవెన్యూశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని.. ధరణిలో జరిగిన తప్పుల్ని ప్రక్షాళన చేస్తామన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్ధాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు.

## బైడెన్ కాన్వాయ్‌ని ఢీకొట్టిన కారు..

జో బైడెన్‌కు తప్పిన ప్రమాదం



**టీ మీడియా, డిసెంబరు 18, వాషింగ్టన్:**

అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కాన్వాయ్‌లోకి ఓ కారు దూసుకొచ్చిన ఘటన కలకలం రేపింది. అధ్యక్షుడు బైడెన్, ఆయన సతీమణి జిల్ బైడెన్ ఆదివారం రాత్రి డెలావర్‌లోని విల్మింగ్టన్‌లో ఉన్న తమ పార్టీ ప్రచార కార్యాలయానికి వెళ్లారు. అక్కడ డిన్నర్ ముగించుకుని ఆఫీసు బయట ఉన్న కాన్వాయ్ వద్దకు వస్తున్నారు. ఇంతలో ఓ కారు వేగంగా దూసుకొచ్చి కాన్వాయ్‌లోని యూఎస్ సీక్రెట్ సర్వీస్ వాహనాన్ని ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా మరో వాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటన జరిగినప్పుడు జిల్ బైడెన్ అధ్యక్ష వాహనంలో కూర్చుని ఉండటా.. ప్రెసిడెంట్ బైడెన్ 130 అడుగుల దూరంలో ఉన్నారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయనను అధ్యక్ష వాహనంలోకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వైట్‌హౌస్‌కు తరలించారు. దంపతులిద్దరు క్షేమంగా ఉన్నారని అధ్యక్ష భవన వర్గాలు వెల్లడించారు. కాగా, ఘటనకు పాల్పడిన డ్రైవర్‌ను సీక్రెట్ సర్వీస్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.

## నాసిక్-పూణే హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం..

- నలుగురు మృతి



**టీ మీడియా, డిసెంబరు 18, మహారాష్ట్ర :**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అహ్మద్‌నగర్‌లోని నాసిక్-పూణే హైవేపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న కార్గో ట్రక్కు కారును ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో కారులోని నలుగురు మృతి చెందారు. మృతుల్లో పసిబిడ్డ కూడా ఉండడం బాధాకరం. మృతులను ఓజస్వి ధంకర్ (2), ఆశా సునీల్ ధంకర్ (42), సునీల్ ధంకర్ (65), అభయ్ సురేష్ విశాల్ (48)గా గుర్తించారు. ఈ ప్రమాదం ఒకరు గాయాలతో బయటపడ్డారు. గాయాలైన వ్యక్తిని అస్మిత అభయ్ విశాల్‌గా గుర్తించారు. అతన్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వేగంగా వస్తున్న కార్గో ట్రక్ కారును ఢీకొట్టి బోల్తాపడిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో కారు నుజ్జు నుజ్జు కావడంతో అకోలే తాలూకాకు చెందిన నలుగురు ప్రయాణికులు మరణించగా.. ఒకరికి గాయాలయ్యాయని చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ట్రక్కులో ఇనుప పైపులు తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం తర్వాత ట్రక్కులోని ఇనుప పైపులన్నీ రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయాయి. దీంతో హైవేపై ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## ఏపీలోనూ అధికార మార్పిడి ఖాయం

- సీపీఐ నారాయణ

**టీ మీడియా, డిసెంబరు 18, హైదరాబాద్ :**

ధరణి పేరుతో మాజీ సీఎం కేసీఆర్ చేసిన మోసం కంటే ఏపీలో జగన్ ఎక్కువగా తప్పులు చేస్తున్నారని సీపీఐ నేత నారాయణ ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలోనూ అధికార మార్పిడి ఖాయమన్నారు. తెలుగు ప్రజానీకానికి బిజెపి వ్యతిరేకంగా ఉందని.. అయితే, ఆ పార్టీకి అనుకూలంగా జగన్ ఉన్నారని మండిపడ్డారు. తెలంగాణ, ఏపీలలో ఒక్కో లోక్ సభ స్థానంలో సీపీఐ పోటీ చేయనుందన్నారు. సీపీఐతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ వల్లే ఓడిపోయిందని విమర్శించారు. తెలంగాణలో అందరినీ కలుపుకుపోవడం వల్ల గెలిచిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం దీన్ని గుణపాఠంగా తీసుకోవాలని సూచించారు. ఇండియా కూటమి ఎంత అవసరమో%ొ% కూటమిలోని భాగస్వామ్య పక్షాలను కలుపుకొని పోవడం అంతే అవసరమన్నారు.

## పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంఛార్జుల నియామకం

**టీ మీడియా, డిసెంబర్ 18,హైదరాబాద్ :**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంఛార్జులను కాంగ్రెస్ పార్టీ నియమించింది. వచ్చే ఏడాది మార్చిలో పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా మంత్రులు, సీనియర్ నేతలను ఇంఛార్జులుగా నియమిస్తూ మార్పులు చేసినట్లు కాంగ్రెస్ హైకమాండ్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా సీతక్క, పెద్దపల్లి పార్లమెంట్ ఇంఛార్జిగా శ్రీధర్‌బాబు, కరీంనగర్ పార్లమెంట్ ఇంఛార్జిగా పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా జీవన్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పి.సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియమించింది.మెదక్ పార్లమెంట్ ఇంఛార్జిగా దామోదర్ రాజనర్సింహ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జిగా తుమ్మల నాగేశ్వరరావు, సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాల ఇంఛార్జిగా భట్టి విక్రమార్క, చేవెళ్ల, మహబూబ్‌నగర్ స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంఛార్జిగా జూపల్లి కృష్ణారావు, నల్గొండ పార్లమెంట్ ఇంఛార్జిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంఛార్జిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇంఛార్జిగా కొండా సురేఖ, మహబూబాబాద్, ఖమ్మం స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ హైకమాండ్ నియమించింది. జనవరిలో పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపింది.



# విద్యుత్ ఉద్యోగుల కార్మికుల ధర్నా

**టీ మీడియా, డిసెంబర్ 18,కడప:**
విద్యుత్ భవన్ ఎదురుగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యోగులు సిఐటియు అనుబంధ సంఘాలైన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ల గౌరవ అధ్యక్షుడు కామనురు శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నా సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను ముఖ్యమంత్రి హామీ మేరకు వెంటనే రెగులైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ యాజమాన్యం విద్యుత్ కార్మికుల పట్ల ఉద్యోగుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తుందని కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. డిస్కం ప్రెసిడెంట్ ఎం శివశంకర్ మాట్లాడుతూ యూనియన్లు చేసుకున్న ఒప్పందం మేరకు విద్యుత్ ఉద్యోగులకు వేతన బకాయిలు కరువు బత్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగసుబ్బయ్య శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో కొన్ని డివిజన్లలో ఈపీఎఫ్ సరిగా అమలు కావడం లేదని పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు బాలకృష్ణ సురేంద్ర మాట్లాడుతూ మీటర్ రీడర్ల పీస్ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టి సారించాలని పేర్కొన్నారు జిల్లా ఉపాధ్యక్షులు కే. సురేంద్రబాబు మాట్లాడుతూ ఈ ధర్నా కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారం కాకుంటే ఎస్పీడీసీఎల్ ఆఫీస్ వద్ద ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం వద్దకు వచ్చి సూపరింటెండింగ ఇంజనీర్ గారు తమ పరిధిలోని సమస్యలు పరిష్కారం చేస్తామని, మిగతా వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలియజేయడంతో ధర్నా కార్యక్రమాన్ని విరమించారు.ఈ ధర్నా కార్యక్రమం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్ జిల్లా నాయకులు నాగమల్లయ్య రాజంపేట డివిజన్ అధ్యక్షుడు ఎరికల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారం కోసమే 'ప్రజావాణి'

**- కమిషనర్ రామలింగం**

**టీ మీడియా, డిసెంబర్ 18,**
**జవహర్ నగర్ :** సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించామని కమిషనర్ రామలింగం అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ఎజెండాగా
పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని అన్నారు. ప్రజావాణికి అందిన 4ఫిర్యాదులకు వెంటనే పరిష్కారమయ్యేలా కృషి
చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మాధవచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు



# సచివాలయం ఉద్యోగుల గుర్తించాలి

**టీ మీడియా, డిసెంబర్ 18, మహానంది:**
రెండు శాఖల మధ్య నలిగిపోతున్న ఎనర్జీ అసిస్టెంట్లు ను సచివాలయం ఉద్యోగుల గుర్తించాలని జిల్లా ఎనర్జీ అసిస్టెంట్ అధ్యక్షుడు అంకాల మధు యాదవ్ అన్నారు. సోమవారం మహానంది మండలం తిమ్మాపురం షబ్ స్టేషన్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ అసిస్టెంట్లు చెంద్రశేకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# లడఖ్‌లోని కార్గిల్‌లో భూకంపం

**టీ మీడియా, డిసెంబర్ 18, న్యూఢిల్లీ :**
లడఖ్‌లోని కార్గిల్‌లో సోమవారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.5 గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్ ) తెలిపింది. దీంతో ఉత్తర భారత్‌తో పాటు పాకిస్థాన్‌లో కూడా ప్రకంపనలు వచ్చాయి. లడఖ్‌లోని కార్గిల్ కేంద్రంగా భూమికి 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపారు. ఉత్తర భారత్‌లోని పలు ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వచ్చాయని తెలిపింది. అలాగే పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ సహా ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలు కనిపించినట్లు పేర్కొంది. సోమవారం తెల్లవారుజామున పాకిస్థాన్‌లో 4.0 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు అక్కడి మీడియా వెల్లడించింది.



# నేడు అంతర కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం


**అసోసియేట్ డీన్ డా.కె.ఎస్ ఎస్ నాయక్**

**టీ మీడియా, డిసెంబర్ 18, మహానంది:**
మహానంది ఫారంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో మంగళ, బుధ, గురు వారాల్లో అంతర కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేట్ డీన్ డాక్టర్ కె ఎస్ ఎస్ నాయక్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కళాశాలలో నిర్వహించే ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఇన్చార్జి డాక్టర్ శారదా జయలక్ష్మి, మహానంది దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ కరుణాసాగర్, డాక్టర్ వెంకటేశ్వర్లు పలువురు ఉన్నత అధికారులు హాజరవుతారని తెలిపారు. అంతర కళాశాల ఆటల పోటీలలో పాల్గొనడానికి 18 కళాశాలలు రావాల్సిఉండంగా ఇప్పటికీ 12 కళాశాలలు వచ్చాయని,రేపటి నుండి మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో ఏ ఇబ్బందులన్నా వెంటనే తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు.అనంతరం కళాశాలల ఫిజికల్ డైరక్టర్ లు, ఓ ఎస్ ఏ లతో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ పి.సాంబశివరావు ఆన్లైన్ లో సమీక్షించి, పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటి అబ్జర్వర్ డాక్టర్ రవికాంత్ రెడ్డి,కళాశాల ఓ ఓస్ ఏ డాక్టర్ రమేష్ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకేరోజు 78, మొత్తంగా

# 92 మంది ఎంపీలపై సస్పెన్షన్

**టీ మీడియా, డిసెంబర్ 18,న్యూఢిల్లీ:**
పార్లమెంటు భద్రతా ఉల్లంఘన అంశంపై ఉభయసభల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. విపక్షాల నిరసనలతో ఉభయ సభల కార్యకలాపాలు నిలిచిపోవడంతో సోమవారంనాడు 78 ఎంపీలపై సస్పెన్షన్ల వేటు పడింది. దీంతో ఇప్పటివరకూ ఉభయసభల్లో సస్పెన్షన్ వేటు పడిన ఎంపీల సంఖ్య 92కు చేరింది.సభాకార్యక్రమాలకు అంతరాయ కలిగించిన 45 మంది ఎంపీలను స్పీకర్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సోమవారంనాడు సస్పెండ్ చేశారు. దీనికి ముందు లోక్‌సభలో 33 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. వీరిలో 30 మందిని శీతాకాల సమావేశాలు ముగిసేంతవరకూ సస్పెండ్ చేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ ప్రకటించారు. ముగ్గురుని ప్రివిలెజ్ కమిటీ నివేదక వచ్చే వరకూ సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. కాగా, ఉభయ సభలో విపక్షాల ఆందోళన కారణంగా ఇంతకుముందే లోక్‌సభ నుంచి 13 మంది ఎంపీలను, రాజ్యసభ నుంచి ఒక ఎంపీని శీతాకాల సమావేశాలు ముగిసేంత వరకూ సస్పెండ్ చేశారు.రాజ్యసభ నుంచి సస్పెండైన



కాంగ్రెస్ ఎంపీలలో జైరామ్ రమేష్, రణదీప్ సింగ్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 18 మంది, టీఎంసీ నుంచి 7, డీఎంకే నుంచి 5, సీపీఎం నుంచి 3, ఆర్జేడీ, జేడీయూ, ఎస్పీ, సీపీఐ నుంచి ఇద్దరేసి చొప్పున, జేఎంఎం, కేసీఎం, ఏజీఎం, ఎన్‌సీపీ నుంచి ఒక్కొక్కరు చొప్పున సస్పెండ్ అయ్యారు. ఎంపీలను పెద్ద సంఖ్యలో సస్పెండ్ చేయడాన్ని విపక్షాలు తప్పుపట్టగా, సస్పెన్షన్ చర్యను రాజ్యసభలో సభానేత పీయూష్ గోయెల్ సమర్థించారు. విపక్షాలు సజావుగా సభలు సాగాలని కోరుకోవడం లేదని, ముందస్తు వ్యూహంతోనే విపక్షాలు సభకు వచ్చారని ఆయన తెలిపారు.



# కువైట్ పాలకునికి నివాళులర్పించిన

**- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి**

**టీ మీడియా, డిసెంబర్ 18, న్యూఢిల్లీ :**
కువైట్ పాలకుడు అమీర్ షేక్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ సాబా (86) అందించిన సహకారాన్ని భారత్ ఎప్పుడు గుర్తుంచుకుంటుదని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. సోమవారం న్యూఢిల్లీలోని కువైట్ రాయబార కార్యాలయంలో జైశంకర్ అహ్మద్ అల్ సాబాకి నివాళులర్పించారు. భారత్-కువైట్‌ల మధ్య సంబందాలను బలోపేతం చేసేందకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. న్యూఢిల్లీలోని కువైట్ రాయబార కార్యాలయంలో అమీర్ షేక్ నవాఫ్ అల్ అహ్మద్ మృతికి సంతాపం తెలిపేందుకు, నివాళులర్పించేందుకు ఢిల్లీలోని కువైట్ రాయబార కార్యాలయానికి చేరుకున్నానని జైశంకర్ ఎక్స్ లో ట్వీట్ చేశారు. భారత్, కువైట్‌ల మధ్య బంధాలను బలోపేతం చేసేందుకు ఆయన చేసిన కృషిని భారత ప్రభుత్వం, ప్రజలు ఎప్పుడూ గుర్తుచేసుకుంటారని అన్నారు. అమీర్ షేక్‌కి గౌరవసూచకంగా ఆదివారం సంతాప దినం పాటించామని అన్నారు. అమీర్ షేక్ మృతికి సంతాపం తెలిపేందుకు ప్రధాని మోడీ ప్రతినిధిగా పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ఆదివారం కువైట్ వెళ్లిన సంగతి తెలిసిందే.



# మాస్కు తప్పనిసరి చేస్తూ కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం

**టీ మీడియా, డిసెంబర్ 18, బెంగళూరు :**
కరోనా సబ్ వేరియంట్ జేఎన్.1 కలవరం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కేరళలో నలుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు మరణించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, గుండె సమస్యలతో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా మాస్కు ధరించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేష్ గుండు రావు పేర్కొన్నారు. కరోనా కేసుల పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ సమావేశమై పలు అంశాలపై చర్చించిందని మంత్రి తెలిపారు. త్వరలోనే కరోనా నివారణకు సంబంధించిన విధివిధానాలు వెల్లడిస్తామని చెప్పారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆస్పత్రులు సిద్ధంగా ఉండాలని ఆదేశించామన్నారు. కేరళ సరిహద్దులో ఉన్న మంగళూరు, చామరాజనగర్, కొడగు జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో కరోనా టెస్టుల సంఖ్య పెంచుతామన్నారు. శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ముందు జాగ్రత్తగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

# మేడిగడ్డ ప్రాజెక్ట్‌పై మంత్రి ఉత్తమ్..

**ఎల్ అండ్ టీ ప్రతినిధులపైఆగ్రహం**

**టీ మీడియా, డిసెంబరు 18, హైదరాబాద్ :** కాంగ్రెస్ తెలంగాణలో అధికారం చేపట్టినప్పటి నుంచి పాలనలో వేగం పెంచింది. తనదైన దూకుడు ప్రదర్శిస్తూ సీఎం రేవంత్ రెడ్డి వరుస సమీక్ష లు నిర్వహిస్తున్నారు. మన్నటి వరకూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో రివ్యూ మీటింగ్ జరిపిన రేవంత్ ఇప్పుడు నీటి ప్రాజెక్టులపై సమగ్ర వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఇక రేవంత్ అండ్ టీం కూడా ఇదే జోష్?లో తమ పరిపాలనా దక్షతకు పదును పెడుతున్నారు.మొన్నటి వరకు పౌర సరఫరాశాఖ అధికారులతో సమీక్షలు జరిపిన తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం నీటి ప్రాజెక్టులు నిర్మించిన ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మేడిగడ్డ బ్యారేజ్ పనులు చేపట్టిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ బృందంతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ మీటింగ్?లో ఎల్ అండ్ టీ గ్రూప్ డైరెక్టర్ ఎస్. వి దేశాయ్?తోపాటు పలువురు సంస్థకు చెందిన ప్రతినిధులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎల్ అండ్ టీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి. రాష్ట్రానికి సంబంధించిన అతి పెద్ద నీటి ప్రాజెక్టులో నాసి రకం పనులు ఎలా చేస్తారని, నాణ్యత లేకుండా ఎలా నిర్మిస్తారని నిలదీశారు. ఏదో ఒక లెటర్ అధికారులకు ఇచ్చి తమ ప్రమేయం ఏమీ లేదని తప్పించుకోవాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. ప్రజా ధనాన్ని వృధా చేసి ప్రాజెక్టు కూలిపోవడానికి కారణమైన ఎవరినీ వదిలిపెట్టమన్నారు.





# భారీగా డ్రగ్స్ పట్టివేత

**టీ మీడియా, డిసెంబర్ 18,హైదరాబాద్:**
నగరంలో నార్కోటిక్ బ్యూరో అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా డ్రగ్స్‌ని పట్టుకున్నారు. ఎస్సార్‌నగర్‌లోని సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో నార్కోటిక్ బ్యూరో అధికారులు డ్రగ్స్‌ని స్వాధీన పరుచుకున్నారు. బర్త్ డే పార్టీ కోసం గోవా నుంచి యువకులు డ్రగ్స్ తీసుకువచ్చారు. పట్టుబడిన నిందితులది నెల్లూరు జిల్లా అని నార్కోటిక్ బ్యూరో తెలిపింది. 12 మంది ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు నార్కోటిక్ బ్యూరో చెప్పింది. ప్రేమ్ చంద్ బర్త్ డే కోసం గోవా నుంచి సంపత్ డ్రగ్స్ తెప్పించాడు. 30 మంది కోసం డ్రగ్స్ పార్టీని ప్రేమ్ చంద్ ఏర్పాటు చేశారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్లు అందరూ కలిపి ఈ పార్టీ చేసుకున్నట్లు సమాచారం.హైదరాబాద్: నగరంలో నార్కోటిక్ బ్యూరో అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా డ్రగ్స్‌ని పట్టుకున్నారు. ఎస్సార్‌నగర్‌లోని సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో నార్కోటిక్ బ్యూరో అధికారులు డ్రగ్స్‌ని స్వాధీన పరుచుకున్నారు. బర్త్ డే పార్టీ కోసం గోవా నుంచి యువకులు డ్రగ్స్ తీసుకువచ్చారు. పట్టుబడిన నిందితులది నెల్లూరు జిల్లా అని నార్కోటిక్ బ్యూరో తెలిపింది. 12 మంది ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు నార్కోటిక్ బ్యూరో చెప్పింది. ప్రేమ్ చంద్ బర్త్ డే కోసం గోవా నుంచి సంపత్ డ్రగ్స్ తెప్పించాడు. 30 మంది కోసం డ్రగ్స్ పార్టీని ప్రేమ్ చంద్ ఏర్పాటు చేశారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్లు అందరూ కలిపి ఈ పార్టీ చేసుకున్నట్లు సమాచారం.



# ఘనంగా మహానందీశ్వరుని పల్లకి సేవ

**టీ మీడియా, డిసెంబర్ 18, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ గంగా, కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో వైభవంగా పల్లకి సేవను సోమవారం రాత్రి నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఆలయ వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో పల్లకి సేవ నిర్వహించారు. ఈ పల్లకి ఉత్సవ కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, మహానంది తహసిల్దార్ జనార్దన్ శెట్టి, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు, నంద్యాల జిల్లా సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.




## పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంఛార్జుల నియామకం

**టీ మీడియా, డిసెంబర్ 18,హైదరాబాద్ :**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంఛార్జులను కాంగ్రెస్ పార్టీ నియమించింది. వచ్చే ఏడాది మార్చిలో పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా మంత్రులు, సీనియర్ నేతలను ఇంఛార్జులుగా నియమిస్తూ మార్పులు చేసినట్లు కాంగ్రెస్ హైకమాండ్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా సీతక్క, పెద్దపల్లి పార్లమెంట్ ఇంఛార్జిగా శ్రీధర్‌బాబు, కరీంనగర్ పార్లమెంట్ ఇంఛార్జిగా పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా జీవన్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పి.సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియమించింది.మెదక్ పార్లమెంట్ ఇంఛార్జిగా దామోదర్ రాజనర్సింహ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జిగా తుమ్మల నాగేశ్వరరావు, సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాల ఇంఛార్జిగా భట్టి విక్రమార్క, చేవెళ్ల, మహబూబ్‌నగర్ స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంఛార్జిగా జూపల్లి కృష్ణారావు, నల్గొండ పార్లమెంట్ ఇంఛార్జిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంఛార్జిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇంఛార్జిగా కొండా సురేఖ, మహబూబాబాద్, ఖమ్మం స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ హైకమాండ్ నియమించింది. జనవరిలో పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపింది.